ఆటో-బైక్ ఢీ

యువకుడి మృతి

మందమర్రి, అక్టోబర్ 3: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని అంగడిబజార్ సమీపంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో రాంటెంకి రాజేశ్(20) మృతి చెందాడు. మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..భీమారం మండలం ఆరెపల్లికి చెందిన రాజేశ్ తన స్నేహితుడు నాగరాజుతో కలిసి తాండూరు మండలం బోయపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. అంగడిబజార్ సర్వీస్ రోడ్డుపై మంచిర్యాల వైపు వెళ్తున్న వీరి బైక్‌ను వెనుకవైపు నుంచి ఆటో ఢీ కొట్టడంతో వెనుక కూర్చున్న రాజేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి దవాఖానకు అక్కడి నుంచి మంచిర్యాల దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రాజేశ్ తండ్రి పోషం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

సాగర్ (ఫైల్)

కోటపల్లి, అక్టోబర్ 3 : కోటపల్లి మండలకేంద్రానికి చెందిన సైదల సాగర్(28) ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడడంతో మృతి చెందాడు. కోటపల్లి నుంచి షట్‌పల్లికి వెళ్లిన సాగర్ తిరుగు ప్రయాణంలో కోటపల్లికి వస్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో చెన్నూర్ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు తల్లి సాలక్క తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

నంబాలలో అగ్నిప్రమాదం

దండేపల్లి, అక్టోబర్ 3: దండేపల్లి మండలంలోని నంబాలలో గురువారం షార్ట్ సర్క్యూట్‌తో గోపతి స్వామి ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇంట్లో వస్తువులతో పాటు, మంచాలు, పరుపులు కాలిపోయాయి. స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపులోకి తేవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు రూ.20వేల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు వాపోయాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

హాజీపూర్, అక్టోబర్ 3 : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన తూర్పాటి చంటి ఆటోలో 150 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా మండలంలోని బస్టాండ్ సమీపంలో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నస్పూర్, అక్టోబర్ 3 : జిల్లాలో ఈ నెల 7 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగ ధ్రువీకరణ పత్రం పొందేందుకు మీ సేవలో స్లాట్‌బుక్ చేసుకుని నిర్ణీత తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు హాజరు కావాలని తెలిపారు. రెన్యూవల్ కోసం కూడా దవాఖానకు సకాలంలో హాజరు కావాలని కోరారు.

డీజే నిర్వాహకుల బైండోవర్

తాండూర్, అక్టోబర్ 3 : అర్ధరాత్రి 12 గంటల సమయం వరకు నిషేధిత డీజేతో బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఆంక్షలు పాటించని నిర్వాహకుడు, యజమానిని గురువారం తాండూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తాండూర్ ఎస్ఐ డీ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో దసరా, బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. డీజేలకు అనుమతులు లేవని తెలిపారు. రాత్రి 10 గంటల లోపు బతుకమ్మ వేడుకలను ముగించుకోవాలని కోరారు.

7న ఉద్యోగ మేళా

నస్పూర్, అక్టోబర్ 3 : మంచిర్యాలలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 7న ఉదయం 10 గంటల నుంచి అంతర్జాతీయ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్‌సీస్ మాస్ పవర్ కంపెనీ లిమిటెడ్, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ శిక్షణ విభాగం ఆధ్వర్యంలో దుబాయ్‌లో డెలీవరీ బాయ్‌గా ఉద్యోగావకాశాలున్నాయన్నారు. కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత, ద్విచక్రవాహన లైసెన్స్, పాస్‌పోర్టు, ఆధార్‌కార్డు ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9490112131, 9440051285, 9701040062 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు ప్రజావేదిక

దహెగాం, అక్టోబర్ 3:మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై ఈ నెల 5న ప్రజావేదిక నర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. 2023-2024 ఆర్థిక సంత్సరంలో చేపట్టిన పనులపై క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీలు చేపట్టారని తెలిపారు. 5న ప్రజావేదిక నిర్వహించి పూర్తిస్థాయిలో వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. కూలీలు, లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

సర్వేను సమర్థవంతంగా చేపట్టాలి

అల్లీపూర్ సర్వేలో మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్

దండేపల్లి, అక్టోబర్ 3: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను సమర్థంగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. దండేపల్లి మండలంలోని అల్లీపూర్ గ్రామం నియోజకవర్గంలోని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికవగా గురువారం సర్వేను ప్రారంభించారు. స్థానిక అధికారులతో కలిసి చైర్మన్ కోట్నాక తిరుపతి సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం మంచిర్యాల ఆర్డీవో రాములు అల్లీపూర్ జీపీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఆయా గ్రామాల జీపీ కార్యదర్శులు, టీం సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్ సర్వే వేగవంతం చేయాలి

జైపూర్, సెప్టెంబర్ 3: జైపూర్‌లో ల్యాండ్ రెగ్యులరైజేషన్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని మంచిర్యాల డీపీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. జైపూర్‌లో మొత్తం 1791 దరఖాస్తులు రాగా వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఎల్పీవో ధర్మారాణి, ఎంపీవో శ్రీపతి బాపు, కార్యదర్శి ఉదయ్ తదితరులున్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

నెన్నెల,అక్టోబర్ 3 : మండలంలోని గొల్లపల్లిలో యువకులకు వాలీబాల్ కిట్లను బీఆర్ఎస్ నాయకులు మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఇందూరి రమేశ్, మాజీ సర్పంచ్ శశికళ గురువారం వాలీబాల్ కిట్లను అందజేశారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటూ క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

బెల్లంపల్లి/కాసిపేట, అక్టోబర్ 3 : బెల్లంపల్లి మండలంలోని కన్నాల బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయం రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. అనంతరం బెల్లంపల్లి 13వ వార్డులో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కాసిపేట మండలం దేవాపూర్ గ్రామానికి చెందిన ఠాకూర్ దుర్గాప్రసాద్‌కు వీల్ చైర్‌ను నాయకులతో కలిసి అందించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన

కన్నెపల్లి, అక్టోబర్ 3 : కన్నెపల్లి మండల కేంద్రంలో రూ. 1.43 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి గురువారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, ఎంపీడీవో గంగామోహన్, వైద్యులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

వైకుంఠధామానికి శంకుస్థాపన

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3: మంచిర్యాలలోని కాలేజ్‌రోడ్డులో గల ఎంసీహెచ్ దవాఖాన సమీపంలో రూ.4 కోట్ల వ్యయంతో వైకుంఠధామ నిర్మాణానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్‌రావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ ఇంజినీర్ మసూద్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

గెలుపోటములను సహజంగా తీసుకోవాలి

హాజీపూర్, అక్టోబర్ 3 : క్రీడాకారులు గెలుపోటములను సహజంగా తీసుకోవాలని బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు అన్నారు. మండలంలోని గుడిపేటలో ఉన్న 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న పోలీసులకు 4 రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలను గురువారం ముగిశాయి. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్ రావ్, కాళిదాసు, ఆర్ ఐలు, ఆర్ ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్ బస్టాండ్ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

జైపూర్, అక్టోబర్ 3 : మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద గురువారం శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్ఐ శ్రీధర్ సీసీ కెమెరాలను ప్రారంభించారు. చెన్నూర్ మంచిర్యాల జాతీయ రహదారిపై బస్టాండ్ వద్ద వ్యాపారుల సహకారంతో కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైన్స్ షాప్‌పై చర్యలు తీసుకోండి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో మాధవి వైన్స్ (షాప్ నంబర్ 10) నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని, ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని అరిజిన్ డెయిరీ సీఏవో బోడపాటి షేజల్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కల్తీ మద్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అరిజిన్ డెయిరీ సీఈవో ఆదినారాయణ, ఆళ్ల వంశీకృష్ణ, ఆర్టీఐ ఫోరం జిల్లా కమిటీ సభ్యురాలు రేఖ, తదితరులు ఉన్నారు.

మొరం ట్రాక్టర్ల సీజ్

• నమస్తే కథనానికి స్పందన

పట్టుకున్న ట్రాక్టర్లు

భీమారం, అక్టోబర్ 3 : అక్రమంగా మొరం తవ్వకాలు, ప్రభుత్వ భూముల నుంచి రాత్రి సమయంలో తరలింపుపై నమస్తే తెలంగాణలో గురువారం ప్రచురించిన కథనంపై తహసీల్దార్ సదానందం స్పందించారు. కొంతకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని, ప్రభుత్వ భూమిని నష్టపరిచే విధంగా గుంతలు పడే విధంగా చేస్తున్నారని, అక్కడ ఉన్న మినీ స్టేడియం ప్రమాదం పొంచి ఉందని పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. దీంతో జేసీబీ ఓనర్ పున్నంతో పాటు, ట్రాక్టర్ యజమాని బొల్లం శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి రెండు ట్రాక్టర్లతో పాటు, జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాములు తెలిపారు. అనుమతి లేకుండా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుంటామన్నారు. బొల్లం శ్రీనివాస్ పోలంపల్లి కాంగ్రెస్ నాయకుడిగా ఉన్నాడు.

బొక్కల గుట్టలో 3 మొరం ట్రాక్టర్ల పట్టివేత

మందమర్రి, అక్టోబర్ 3: మందమర్రి మండల పరిధిలోని బొక్కలగుట్ట గ్రామ సమీపంలో అనుమతి లేకుండా మొరం తవ్వకాలు జరిపి అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహసీల్దార్ సతీశ్ కుమార్ గురువారం పట్టుకున్నారు. బొక్కలగుట్ట గ్రామ శివారు ప్రాంతంలో అనుమతి లేకుండా మొరం తవ్వకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు నిఘా వేసి అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. మొరం తవ్వకాలు జరిపిన జేసీబీ దొరకలేదని త్వరలోనే జేసీబీ వాహనాన్ని కూడా పట్టుకుని సీజ్ చేస్తామని తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

జన్నారం, అక్టోబర్ 3 : మండలంలోని దంతన్‌పెల్లికి చెందిన చింతకింది రమ్య దేవునిగూడలో ఓ ఫంక్షన్‌కి వెళ్లి వస్తుండగా మెడలోని 2 తులాల బంగారు పుస్తెల తాడును దుండగులు బైక్‌పై వచ్చి లాక్కెళ్లారు. దీనిపై ఎస్ఐ రాజవర్ధన్‌ను వివరణ కోరగా మహిళ మెడలో నుంచి గొలుసును ఎత్తుకెళ్లిన దొంగల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ఇంట్లో చోరీ

కౌటాల, అక్టోబర్ 3 : మండల కేంద్రంలోని బీసీ వాడలోని పందిళ్ల శ్రీనివాస్ ఇంట్లో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగింది. బాధితుడు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఆరోగ్యం బాగలేక పోవడంతో సోమవారం మహారాష్ట్రకు వెళ్లాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి రూ.70 వేల నగదు, 30 తులాల వెండి, 3 గ్రాముల బంగారంతో పాటు కొత్త బట్టలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ మధుకర్ కేసు నమోదు చేసి క్లూస్ టీంతో పలు ఆధారాలను సేకరించారు.

కొలువుదీరిన దుర్గామాతలు

• పలు ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు

నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 3 : మంచిర్యాల, కుమ్రం ఆసిఫాబాద్ జిల్లాల్లోని అన్ని మండలాల్లో గురువారం దుర్గాదేవి విగ్రహాలు మండపాల్లో కొలువుదీరాయి. భాజాభజంత్రీలు, డీజే సిస్టం, నృత్యాలు, మహిళల కోలాటాలు, మంగళహారతుల మధ్య విగ్రహాలను వాహనాల్లో తీసుకువచ్చారు. మండపాల వద్ద అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చెన్నూర్ పట్టణంలో దుర్గాదేవి విగ్రహాన్ని శోభాయాత్రగా తీసుకెళ్తున్న భక్తులు

ధ్రువీకరణ పత్రాల పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలి

ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, అక్టోబర్ 3 : డీఎస్సీ 2024 మెరిట్ లిస్టులో స్థానం కలిగి ఉన్న అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్మెల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను డీఈవో యాదయ్యతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఎస్సీ 2024 మెరిట్ లిస్టులో ఉన్న 715 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తామని తెలిపారు. ధ్రువీకరపత్రాలను పరిశీలించే సమయంలో ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు.

ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

అనుమతి లేని లే అవుట్ల క్రమబద్ధీకరణ కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీటీసీపీ అధికారి సంపత్‌తో సమావేశం నిర్వహించారు. దరఖాస్తులను తిరస్కరించినట్లయితే దరఖాస్తుదారుడికి సమాచారం అందించాలన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యం

హాజీపూర్, అక్టోబర్ 3 : మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని మంచిర్యాల కలెక్టర్ కమార్ దీపక్ అన్నారు. గురువారం మండల తహసీల్ కార్యాలయంలో వన మహోత్సవం కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, డీఆర్డీఏ అధికారి కిషన్‌తో కలిసి మొక్కలను నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ నాటిన మొక్కలను రక్షించడంతో జీవకోటి మనుగడ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్ పాండే, డిప్యూటీ తహసీల్దార్ హరిత, ఈజీఎస్ ఏపీఎం మల్లయ్య, ఏపీఎం రాజన్నతో పాటు తహసీల్దార్, ఈజీఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

కాసిపేట, అక్టోబర్ 3 : ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం లంబాడీతండా(కే)లో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించడంలో భాగంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీ కోసం పైలెట్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో దండేపల్లి మండలం అల్లీపూర్ గ్రామం, బెల్లంపల్లి నియోజకవర్గంలో కాసిపేట మండలం లంబాడీతండా(కే), చెన్నూర్ నియోజకవర్గంలో చెన్నూర్ మండలం సంకారంతో పాటు ఒక్కో మున్సిపాలిటీలో ఒక్కో వార్డు చొప్పున ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా సర్వే చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సఫ్దర్ అలీ, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు విద్యాసాగర్, నరేశ్, కీర్తి, కంప్యూటర్ ఆపరేటర్లు రాజేందర్, శ్రీలత, బృంద సభ్యులు పాల్గొన్నారు.

'పోలీస్ డ్యూటీ మీట్' మంచి వేదిక

• రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్


పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : పోలీస్ అధికారులు, సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి పోలీస్ డ్యూటీ మీట్ మంచి వేదిక అని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానికంగా కాళేశ్వరం జోన్ పరిధిలోని అధికారులు, సిబ్బందికి పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిసారి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతిభను చూపిన వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏసీపీలు రమేశ్, వెంకటస్వామి, రాములు, ప్రతాప్, సుందర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రతే షీ టీం లక్ష్యం

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మహిళలు, బాలికలు, విద్యార్థినుల భద్రతే షీ టీం లక్ష్యమని రామగుండం సీపీ శ్రీనివాస్ గురువారం పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో రెండు షీ టీం బృందాలు పని చేస్తున్నాయని, స్కూళ్లు, కాలేజీల్లో ర్యాగింగ్, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. షీ టీం నంబర్ 6303923700కు లేదా 100కు సమాచారం ఇవ్వాలన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీపీ శ్రీనివాస్ అన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 3: మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీలోని తీగల్‌పహాడ్ శివారు ప్రాంతంలో గల చెట్ల పొదల్లో ముగ్గురు యువకులు గంజాయితో పట్టుబడ్డారు. సీసీసీ నస్పూర్ ఎస్ఐ నెల్కి సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నస్పూర్‌కు చెందిన గోదారి రాజు, జాడి వంశీ, సాయికుమార్‌తో పాటు మరో నలుగురు యువకులు భద్రాచలం నుంచి తక్కువ ధరకు తీసుకువచ్చిన గంజాయిని తీగల్‌పహాడ్ శివారు ప్రాంతంలో గల క్రషర్‌మిల్ చెట్ల పొదల్లో పంచుకోవడానికి వెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకోవడంతో ఇందులోని నలుగురు పారిపోగా, గోదారి రాజు, జాడి వంశీ, సాయికుమార్ పట్టుబడ్డారు. వీరి వద్ద నుండి 1.5 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆకుల అశోక్, ఎస్ఐ సుగుణాకర్ తెలిపారు. గంజాయికి, జల్సాలకు అలవాటైన ఏడుగురు యువకులు భద్రాచలం నుంచి తక్కువ ధరకు గంజాయి కొని, ఇందులో వీరు కొంత తాగడానికి, మరి కొంత గంజాయిని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. యువత గంజాయికి బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం చేయాలి

నస్పూర్ /ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 3 : రాష్ట్రంలో రైతుల వద్ద ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించగా కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్ ధోత్రే, కుమార్ దీపక్, అదనపు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. సన్నరకం వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని సీఎం తెలిపారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని తెలిపారు. గన్ని సంచులను సరిపడా అందుబాటులో ఉంచాలని, వసతులు కల్పించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్లు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ వరిధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

వేతనాలు చెల్లించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 3: బీసీ హాస్టల్ వర్కర్లకి పెండింగ్‌లో ఉన్న 12 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. గురువారం వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి సజీవన్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకుడు తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగ జంపుల తిరుపతి, బీసీ హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమురయ్య, అన్సార్, లక్ష్మి, శారద, పార్వతి, శకుంతల,లలిత, పోషక్క, సరోజ, అమిత్ తదితరులు ఉన్నారు.

కార్మికులకు దసరా బోనస్ చెల్లించాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 3: పేపర్ మిల్లు యాజమాన్యం పేపర్ మిల్లు కార్మికులకు దసరా బోనస్ 20 శాతం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ ట్రేడ్ యూనియన్ విభాగం ప్రతినిధి అంబాల ఓదెలు కోరారు. పేపర్ మిల్లు పునఃప్రారంభమై ఆరేళ్లయినా బోనస్ 8.33 శాతమే ఇస్తున్నారని తెలిపారు. నిలుపుదల చేసిన ప్రొడక్షన్ బోనస్ పునరుద్ధరించాలని, 30 రోజుల సెలవు దినాలు యాథావిధిగా కొనసాగించాలన్నారు.

బతుకమ్మ సంబురాలు

కౌటాల, అక్టోబర్ 3 : మండల కేంద్రంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలను గురువారం నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకురాళ్లు బతుకమ్మ ఆడారు. ప్రిన్సిపాల్ సంగ కిరణ్‌కుమార్ బతుకమ్మ విశిష్టతను తెలియజేశారు.

దండేపల్లి, అక్టోబర్ 3 : దండేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకురాళ్లు బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభ, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్‌షాక్ తో చిన్నారులకు గాయాలు

వాంకిడి,అక్టోబర్ 3: వాంకిడి లోని కేబీ నగర్‌కి చెందిన షేక్ రిహాన్ (12) సమీరా (10) విద్యుత్ షాక్‌కి గురయ్యారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గురువారం సాయంత్రం ఇంటి ఆవరణలో సరదాగా క్రికెట్ ఆడుతుండగా బాల్ ఇంటి రేకుల షెడ్‌పై పడింది. తీసున్న క్రమంలో షెడ్‌కి ఆనుకుని ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ తగిలి ఉండడంతో ప్రమాదవశాత్తు ఇద్దరు విద్యుత్ షాక్‌క